క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై విచారణ



వార్డు సభ్యులను విచారిస్తున్న డీఎల్‌పీఓ

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో గురువారం పంచాయతీ నిధులు దుర్వినియోగం అభియోగంపై శ్రీకాళహస్తి డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) విచారణ చేశారు. ఇటీవల పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు జెడ్పీటీసీ తిరుమలయ్య జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి డీఎల్‌పీఓ వికృతమాల సచివాలయంలో సర్పంచ్ రుక్మిణి, వార్డు సభ్యులను విచారించారు. పంచాయతీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వార్డు సభ్యులు తెలిపారు. ఈ విషయంపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించి డీపీఓకు నివేదికను పంపనున్నట్లు డీఎల్‌పీఓ చెప్పారు.

మెనూ తప్పనిసరి



భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న పథకంలో తప్పనిసరిగా ప్రభుత్వ మెనూ అమలు చేయాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన గురువారం వెస్టువరత్తూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించి, రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామన్నారు.

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

ఏర్పేడు: వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని ఐఏటీ తిరుపతి నోడల్ అధికారి ఆర్ఎస్‌కే చైతన్య అన్నారు. గురువారం చిందేపల్లిలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఐఏటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ సూచనల మేరకు రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఐఏటీ అధ్యాపకులు జీవీ సుబ్బారెడ్డి, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్లకు సీలు ఉండాలి



తహసీల్దార్ కార్యాలయంలో సీలు వేసిన మిషన్లను పరిశీలిస్తున్న సీఐ

సత్యవేడు: డీలర్లు రేషన్ షాపుల్లో వినియోగిస్తున్న వేయింగ్ మిషన్లకు తూనికల అధికారుల వద్ద సీలు వేసి ఉండాలని లీగల్ మెట్రాలిటీ విభాగం తిరుపతి అధికారి కె.మల్లేశ్వర్ కోరారు. గురువారం సత్యవేడు మండలంలోని డీలర్ షాపులో వినియోగిస్తున్న వేయింగ్ మిషన్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలోని 55 రేషన్ దుకాణాల్లో ఉన్న వేయింగ్ మిషన్లకు సీలు వేయించారు. డీలర్లు సీలు వేసిన ఒక్కొక్క మిషన్‌కు రూ.900 చెల్లించారు. రేషన్ దుకాణాల తనిఖీ సమయంలో వేయింగ్ మిషన్లకు సీలు లేకుండా ఉంటే రూ.25 వేలు జరిమానా విధిస్తామన్నారు.

గ్రామసభలు నిర్వహించండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు: స్వర్ణాంధ్రకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. గురువారం సచివాలయ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. స్వర్ణాంధ్రకు సంబంధించిన పోస్టర్‌ను సిబ్బందితో కలసి ఎంపీడీఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

29న కదూరు పీఏసీఎస్ మహాజన సభ

వరదయ్యపాళెం: ఈనెల 29న ఉదయం 11 గంటలకు వరదయ్యపాళెంలోని కదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మహాజన సభ నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జ్ అమరవేలు, సీఈఓ సంపత్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు దాకా జరిగిన జమాఖర్చులు నివేదిస్తామని చెప్పారు. అలాగే 2023–24 ఆడిట్ రిపోర్టును పరిశీలించి ఆమోదిస్తామని తెలిపారు.

గృహ సంకల్పం అయ్యేనా?

నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఆప్షన్–3 ద్వారా లబ్ధిదారులు నిర్మాణాల బాధ్యతలు చేపట్టారు. జగనన్న లేఔట్లలో నియోజవర్గంలో 9,322 మంది లబ్ధిదారుల్లో కొందరికి ఇంటి పట్టాలు, గృహాలు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో ఇంకా 329 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇసుక సమస్య, నీటి సమస్య, విద్యుత్ సమస్యలతో గృహనిర్మాణాలు నత్తనడకన సాగుతోంది.

- వచ్చే మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలి
- పూర్తి కాకుంటే నిధులకు అవరోధం
- ఆరు నెలల తరువాత గ్రాంటు నిలిచిపోయే ప్రమాదం
- లబ్ధిదారులను భాగస్వామ్యం చేసేందుకు ప్రయత్నం
- నియోజకవర్గంలో ఇంకా ప్రారంభించని ఇళ్లు 329



సత్యవేడు జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సత్యవేడు: నియోజవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 9,322 మందికి గృహాలు మంజూరు చేయగా 5,684 ఇళ్లు పూర్తి అయ్యాయి. ఇళ్ల నిర్మాణ ప్రగతిని గుర్తించేందుకు ప్రతి లేఔట్‌కు ఒక ఇన్‌చార్జ్‌ని నియమించారు. లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల వివరాలను ఇన్‌చార్జ్‌లు జిల్లా అధికారులకు తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చారు. 2025 మార్చి నాటికి ఇళ్లు పూర్తిచేయాలని మండల అధికారులకు ఆదేశాలు అందాయి. 2025 మార్చిలోగా పూర్తి చేయకపోతే, గ్రాంటు నిలిచిపోయే ప్రమాదం ఉందని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. మార్చి తర్వాత ప్రభుత్వం పీఎంఏవై 2.0అమలు చేస్తుండడంతో ప్రస్తుతం వచ్చే రూ.1.80లక్షలు నిలిచిపోనున్నాయి.

ఇళ్లు పూర్తికాకుంటే నిధులకు అవరోధం

గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు 2025 మార్చి నాటికి పూర్తి కాకపోతే పీఎంఏవై 1.0 ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల నిధులకు అవరోధం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. గడువు లోపు ఇళ్లు పూర్తి చేయకుంటే బిల్లులు వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు.

లబ్ధిదారులకు అవగాహన సమావేశాలు

ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గృహాలు త్వరితగతిన పూర్తిచేసేందుకు ఇన్‌చార్జ్ అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఎంపీడీఓ, హౌసింగ్ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అవగాహన సమావేశాలకు ప్రజాప్రతినిధులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారు. ఈనెల 28న లేఔట్లలో మన ఇల్లు–మన గౌరవం అవగాహన సమావేశాలు నిర్వహించి లబ్ధిదారుల బ్యాంకు ఖాతా, ఆధార్ అప్డేషన్, ఈకేవైసీ సమస్య, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లను గుర్తిస్తారు.

మౌలిక వసతులపై దృష్టి

లేఔట్‌కు అప్రోచ్ రోడ్డ్, ఇంటర్నల్‌రోడ్స్, నీరు, విద్యుత్ సరఫరా సమస్యలతో గృహనిర్మాణాలు ప్రగతి వెనుకబడి ఉంటే సదరు సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ అధికారులు సమర్పిస్తారు. అదనపు రుణం మంజూరు కాని ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులను గుర్తించి సమస్య పరిష్కారం కోసం ఏపీఎం, సీసీ గ్రూప్ అనిమేటర్ దృష్టికి తెస్తారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 90 పనిదినాలకు వేతనాలు పొందని లబ్ధిదారులను గుర్తించి జాబితా తయారుచేస్తారు. బీఎల్ స్టేజ్ పూర్తి చేసుకొన్నవారికి 50 పనిదినాలు, రూఫ్ లెవల్ స్టేజీ వరకు మిగిలిన 40 పనిదినాలు అందాయా లేదా అని పరిశీలన చేస్తారు.



సత్యవేడులో ఇంటికి పునాదులతో ఆగిన నిర్మాణం

త్వరితగతిన పూర్తిచేయాలి



లబ్ధిదారులు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి. ప్రతిఒక్కరూ కచ్చితంగా నిర్మించుకోవాలి. లేఔట్లలో మౌలిక సదుపాయల కల్పన, సకాలంలో బిల్లుల చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము సామగ్రి అందుబాటులో ఉంది. ఈనెల 28న అన్ని లేఔట్లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– చంద్రశేఖర్, ఎంపీడీఓ సత్యవేడు

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఉప కారాగారాన్ని సందర్శించారు. పరిసరాలు, సబ్‌జైలులో వసతులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బెయిల్ గురించి కూడా అవగాహన కల్పించారు. ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న హేమలత

ఏర్పేడు: ప్రభుత్వం రైతులకు తక్షణ పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భార్గవికి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయసాగుకు పెట్టుబడి కింద రైతులకు రూ.20 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు అందించకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు తొలగించాలన్నారు. ఒక్కొక్క రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని చెప్పారు. రైతు సంఘం నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

ఎపీఐఐసీ భూముల పరిశీలన



ఎపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాలతోపాటు, తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాల గ్రామంలో ఎపీఐఐసీకి కేటాయించిన భూములను గురువారం తహసీల్దార్ సుబ్రమణ్యం, డీటీ చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాల్లోని ఎపీఐఐసీ భూముల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. మండలంలో ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెంలో 2,095 ఎకరాల ఎపీఐఐసీ భూములున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో భూమిని కేటాయిస్తామని తెలిపారు. వీఆర్ఓ భాస్కర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుధ్య పనులు చేయిస్తున్న ఇందిరమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ ప్రజలకు సూచించారు. ఆమె గురువారం గ్రామంలో పలు అభివృద్ధి పనులతోపాటు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, వీధిలైట్లకు మరమ్మతులు చేయించి, పారిశుధ్య పనులను, గ్రీన్ అంబాసిడర్లచే బ్లీచింగ్ చేయించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశారు. పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించారు. తంగెళ్లపురం గిరిజన కాలనీలో తాగునీటి కోసం బోరు వేసి, చేతిపంపు బిగించారు. సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్‌లో గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

జగనన్నకు ఘనస్వాగతం పలుకుదాం

శ్రీకాళహస్తి: తిరుమల పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం తెలిపింది. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తిరుపతి విమానాశ్రయానికి శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటలకు చేరుకుంటారని ఆయనకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలకాలని కోరారు.

ఇళ్లలో వరుస చోరీలు

– హడలిపోతున్న రేణిగుంట వాసులు

రేణిగుంట: పట్టణంలో వారం రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. రేణిగుంట పంచాయతీ గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో సత్యమ్మ ఆలయ పూజారి వల్లియమ్మ ఇంటికి తాళం వేసి ఊరెళ్లింది. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం తీసి ఉంది. లోనికి వెళ్లి చూస్తే బీరువా పగులకొట్టి అందులోని దుస్తులు కింద పడి ఉన్నాయి. పరిశీలించగా తలుపు తాళం కట్ చేసి లోనికి ప్రవేశించి ఉన్నారు. బీరువాలో దాచిన రూ.70 వేల నగదు, వెండి గ్లాసు, దీప స్తంభాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈనెల 20న అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌరీనగర్‌లో నివసిస్తున్న విద్యుత్‌శాఖలో లైన్‌మన్ వెంకటేష్, సీఆర్ఎస్‌లో పనిచేస్తున్న అతని భార్య మునికుమారి పిల్లలను స్కూల్‌కు పంపి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మునికుమారి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఇంట్లో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.97వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారంలో రెండు చోరీలు జరగడంతో దొంగల ముఠా సంచారం మొదలైనట్టు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చోరీలు అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

10శాతం కేటాయింపు సంతోషకరం

శ్రీకాళహస్తి: మద్యం దుకాణాల్లో 10శాతం గౌడ కులస్తులకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని శ్రీబాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సొసైటీల తరఫున దుకాణాలను ఇస్తే భాగస్తులు అందరూ బాగుపడే అవకాశం ఉంటుందన్నారు. ఆదిశగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉదయగిరి మోహన్ గౌడ్, బత్తికృష్ణగౌడ్, కన్నయ్యగౌడ్, ఈశ్వరయ్యగౌడ్, తిరకాల పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టు డే



మెడికల్ దుకాణ యజమానిని సన్మానిస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొత్తపేటలోగల శ్రీరామ మందిరంలో శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఫార్మసిస్టు డే వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని మెడికల్ షాపుల ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు. తిరుపతి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అస్సోయేషన్ కార్యదర్శి రాము, మధుసూదన్‌రావు, గోపాల్, కార్తీక్ రెడ్డి, అమరా జనార్ధన్, ఆనంద్‌గుప్తా, కమిటీ మెంబర్లు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకంతో పంపిణీ చేయాలి



వరదయ్యపాళెంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మలేశ్వర

వరదయ్యపాళెం: రేషన్ సరుకులు కచ్చితమైన తూకంతో అందజేయాలని, తేడాలొస్తే సంబంధిత షాపు నిర్వహణ డీలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ మలేశ్వర హెచ్చరించారు. ఆయన తూనికలు, కొలతలు సిబ్బందితో కలసి గురువారం వరదయ్యపాళెంలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాపుల త్రాసులను పరిశీలించి ముద్రలు వేశారు. ఆయన వెంట సిబ్బంది గణేష్, యోగేష్, పెదబాబు ఉన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దళిత, ఆదివాసీ, ఇతర పేద విద్యార్థులు చదివే లక్ష్యంగా సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలని ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో 60 శాతంగా ఉన్న హాస్టల్ విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 40 శాతానికి పడిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేసి రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గాజులమండ్యంలో పోషణ మాసోత్సవాలు



వరదయ్యపాళెంలో మాట్లాడుతున్న జ్యోతి

రేణిగుంట: సమతుల పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. గాజులమండ్యంలో ఆ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి గురువారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పిలుపునిచ్చారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గురువారం కారిపాకంలో గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహార ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హృదయం' కాపాడుకుందాం

శ్రీకాళహస్తి: మంచి ఆరోగ్యం కోసం గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ ఫిజీషియన్, గుండె వైద్యనిపుణులు డాక్టర్ పి.విజయకుమార్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. గుండెజబ్బులు రాకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. మంచి ఆరోగ్యం కోసం పలు సూచనలు చేశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం కల్పించాలి



ఓపెన్ స్కూల్ వివరాలను తెలియజేస్తున్న అధికారులు

చంద్రగిరి: అనివార్య కారణాల వల్ల మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం కల్పించాలని ఓపెన్ స్కూల్ తిరుపతి జిల్లా రాష్ట్ర కో–ఆర్డినేటర్ నాగేందర్‌రావు అన్నారు. గురువారం తిరుచానూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎప్పుడో మానివేసిన చదువును కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ చక్కటి అవకాశం కల్పించిందని చెప్పారు. 14 ఏళ్లు పూర్తయిన వారు పదో తరగతి, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ ద్వారా చదవవచ్చని తెలిపారు. ఈ సందర్భంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గురుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న పితృదేవతలకు పిండ ప్రదాన పూజలు



మాట్లాడుతున్న రాజేష్

తిరుపతి కల్చరల్: భాద్రపద మాసం బహుళ పాడ్యమి నుంచి మహాపక్షాల నేపథ్యంలో చివరి రోజైన అక్టోబర్ 2వ తేదీన అత్యంత పవిత్రమైన మహాలయ అమావాస్య రోజున కపిలతీర్థంలో పిండప్రదాన పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీకపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవాసంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్ తెలిపారు. మహాలయ అమావాస్య నాడు మరణించిన తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదాన పూజలు నిర్వహించడం ద్వారా వారి ఆత్మలకు శాంతి కలుగుతుందని తెలిపారు. ఇందులో 250 మంది బ్రాహ్మణ పురోహితులు పాల్గొని పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ఈ పిండ ప్రదాన పూజలు కొనసాగుతాయన్నారు. శ్రీకపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవా సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ ల్గొన్నారు.

శ్మశానాన్ని వదలని పచ్చ ఇసుక మాఫియా

- స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ట్రెంచ్‌లను సైతం పూడ్చి వేస్తున్న వైనం
- పరిశీలించిన సీపీఐ బృందం



పుల్లారెడ్డి కండ్రిగలో స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం



ఇసుక తోడేసిన స్వర్ణముఖీ నదిని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో టీడీపీ నాయకుల అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపూలేకుండా కొనసాగుతున్నాయి. స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి కోట్లు కొల్లగొడుతున్నారు. సంబంధిత అధికారులు అటువైపు వెళ్లేందుకే సాహసించకపోవడంతో వారిని అడిగే వారే లేకుండా రాత్రి పగుళ్లు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. వారం రోజులుగా మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతుంటే స్థానిక రైతులు అడ్డుకొని స్వర్ణముఖి నదిలోకి ఎవరూ వెళ్లకుండా కందకాలు తవ్వారు. దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఇసుక అక్రమ రవాణా చేసే పచ్చ నేతలు రైతులపై అక్రమ కేసులు పెడతామని భయాందోళనకు గురిచేసి తవ్విన కందకాలను పూడ్చివేసి ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి ఆధ్వర్యంలోని సీపీఐ నాయకులు గురువారం అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఇసుకను అక్రమరవాణా చేస్తున్నా స్థానికంగా ఉన్నటువంటి సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులోపడి ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారని అన్నారు. స్వర్ణముఖి నదిలో తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలు అడుగంటుతాయని తెలిసినప్పటికీ అధికారులు ఏ కోశాన పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇసుక అక్రమార్కులు శ్మశాన దిబ్బలను కూడా చూడకుండా జేసీబీలతో తవ్వకాలు చేస్తూ అధికారులకు మామూళ్లు ఇస్తూ ఇసుక బకాసురులు కోట్లు గడిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా దీనిపై కలెక్టర్ స్పందించి ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో పుల్లారెడ్డి కండ్రిగ గిరిజనులను, దళితులను ఐక్యం చేసి అధికార పార్టీ ఇసుక బకాసురులను ఎండగడతామన్నారు. నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, రూరల్ మండలం కార్యదర్శి మించల శివకుమార్, పట్టణ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.